సాక్షి రంగారెడ్డి

ఆదివారం | 29 | జూన్ | 2025



దేశ రక్షణలో యువత..

విద్యార్థి దశ నుంచే దేశభకి, రాజకీయాలపై మక్కువ పెంచుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. 8లో▸



దారి మూసేయడం తగదు

కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ భూములను విక్రయించడమే పనిగా పెట్టుకుందని ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. 8లో▸



శిక్షణ కేంద్రం నుంచి ..

బెంగళూరులో అగ్నివీర్ శిక్షణ పొందుతున్న బేగంపేటకు చెందిన యువకుడు దయ్యాల సతీశ్ అదృశ్యమయ్యాడు. 8లో▸

ఎఫ్‌టీఎల్‌లో ఇళ్లు!



అధికార బలంతో వెంచర్

- 2023–24లో అనుమతులు ఇచ్చిన టీపీఓ, కమిషనర్
- రద్దు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం
- గుడెం కుంటను కాపాడలని స్థానికుల వినతి

తుర్కయంజాల్: చెరువులు, కుంటల పరిరక్షణకు ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున కూల్చివేతలు చేపడుతున్నా కొందరు అధికారుల తీరులో మార్పు కనిపించడం లేదు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను పరిశీలించకుండానే అనుమతులు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని ఇంజాపూర్, తుర్కయంజాల్, మన్నెగూడ, తొర్రూర్, మునగనూర్, కొహెడ రెవెన్యూలోని అనేక చెరువులు, కుంటల పరిధిలో పలు నిర్మాణాలకు అధికారులు అనుమతులు జారీ చేయడం, అవి ఆలస్యంగా బయటకు పొక్కుతుండడం చర్చకు దారితీస్తున్నాయి.

ఎఫ్‌టీఎల్‌లోనే వెంచర్

ఇంజాపూర్‌లోని సర్వే నెంబర్లు 96, 97, 98, 99, 100, 104, 105లో 15.9 ఎకరాల ఎఫ్‌టీఎల్, 2.10 ఎకరాల బఫర్ జోన్‌తో గుడెం కుంట చెరువు విస్తరించి ఉంది. 2017లో హెచ్‌ఎండీఏ ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసి, 2024 సెప్టెంబర్‌లో ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చింది. కొన్నేళ్ల క్రితం నగరానికి చెందిన ఓ రాజకీయ నాయకుడు తనకున్న అధికార బలంతో ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్ చేశాడు. ఆ తరువాత యథేచ్ఛగా ప్లాట్లను విక్రయించాడు.

యథేచ్ఛగా ఇంటి నిర్మాణ అనుమతులు

2023 డిసెంబర్, 2024 జనవరిలో 12 ప్లాట్లకు ఎన్‌ఓసీలు లేకుండానే అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారి, కమిషనర్ ఇంటి నిర్మాణ అనుమతులు జారీ చేశారు. ఈ విషయం ఆలస్యంగా బయటకు వచ్చింది. ఇది తెలుసుకున్న పలువురు స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. 18 నెలలు పూర్తి అవుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వీటిని రద్దు చేసే విషయంలో వెనకడుగు వేస్తుడటం సర్వత్రా విమర్శలకు దారితీస్తుంది.

ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించేందుకు విఫలయత్నం

ఇటీవల ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్–2020లో దరఖాస్తు చేసుకున్న వారు రాయితీపై ఫీజు చెల్లించే అవకాశం కల్పించడంతో ఈ లే అవుట్‌లోని ప్లాట్ల యజమానులు చెల్లించేందుకు యత్నించినా సాధ్యం కాలేదు. దీంతో గతంలో మాదిరిగా అధికారులనే ప్రసన్నం చేసుకుని అనుమతులు పొందాలని భావించి పలు ప్లాట్లకు డబ్బులు సైతం చెల్లించారనే ప్రచారం సాగుతోంది. అధికారులు వినకపోవడంతో ఓ ప్రజా ప్రతినిధితో చెప్పించేందుకు యత్నించారని గుసగుసలు వినిపించాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎఫ్‌టీఎల్ పరిధిలో జారీ చేసిన నిర్మాణ అనుమతులను రద్దు చేయడంతో పాటు, చెరువును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలించిన తర్వాతే అనుమతులు

చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో మున్సిపల్ అధికారులు ఇంటి నిర్మాణ అనుమతులు జారీ చేయవద్దు. గతంలో జారీ చేసిన వాటిని రద్దు చేసే అధికారం వారికే ఉంది. ఇప్పటికే అన్ని చెరువులకు సంబంధించిన మ్యాప్‌లను అధికారులకు అందజేశాం. వీటిని పరిశీలించిన తర్వాతే అనుమతులు ఇవ్వాలి.

– వంశీ, ఇరిగేషన్ ఏఈఈ, అబ్దుల్లాపూర్‌మెట్

చర్యలు తీసుకుంటాం

గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు గుడెం కుంటలో ఇంటి నిర్మాణ అనుమతులు జారీ చేసిన విషయం ఆలస్యంగా తెలిసింది. దీనిపై విచారణ చేపడుతున్నాం. ప్లాట్లను పరిశీలించాక తగిన చర్యలు తీసుకుంటాం. ఇంటి నిర్మాణ అనుమతులను రద్దు చేస్తాం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో ఎలాంటి నిర్మాణాలను చేపట్టవద్దు.

– కె.అమరేందర్ రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్



ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌లో మంత్రి తుమ్మల, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

- వాణిజ్య రైతులు దృష్టిసారించాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- దేవునిఎర్రవల్లిలో ఆయిల్‌పామ్ సాగు ప్లాంటేషన్

చేవెళ్ల: ఉద్యాన పంటలు, డెయిరీల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని దేవునిఎర్రవల్లిలో శనివారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి పొలంలో 21 ఎకరాల్లో చేపట్టిన ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌ను స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఉద్యానశాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్‌బాషాలతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ డిమాండ్‌కు తగిన విధంగా రైతులు ముందుకురావాలన్నారు. సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలపై దృష్టిసారించాలని సూచించారు. రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపడా కూరగాయలు పండకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు తెలుగు రాష్ట్రాల భూములు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. దేశానికి సరిపడా కావాలంటే 70లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాల్సి ఉందన్నారు. తెలంగాణలో జిల్లాకో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటే లక్ష్యమని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతుభరోసా నిధులు విడుదల చేశామని వెల్లడించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ డ్రిప్ పరికరాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లాలో శనివారం ఒక్కరోజే 557 ఎకరాల్లో ప్లాంటేషన్ చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. 5వేల ఎకరాల్లో పంట సాగుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ముప్పై ఏళ్ల పాటు ఆదాయం

హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుకు ఎకరానికి 52 వేల సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. ఒక్కసారి సాగు చేస్తే ముప్పై ఏళ్ల పాటు ఆదాయం వస్తుందన్నారు. ఇది రైతులకు ఒక ఫిక్స్‌డ్ డిపాజిట్ వంటి కార్యక్రమమని స్పష్టంచేశారు.

ఫ్యాక్టరీ ఏర్పాటు చేయండి

జిల్లాతోపాటు చేవెళ్ల నియోజకవర్గంలోని రైతులు ఎక్కువగా ఆయిల్‌పామ్‌సాగు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. స్థానికంగా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. అందరికీ అందుబాటులో ఉండేలా గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌లో లేదా అజీజ్‌నగర్‌లో ఏర్పాటు చేసేలా కృషి చేయాలన్నారు.

డ్రోన్ ఇప్పించండి..

సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. మంత్రి స్ఫూర్తితోనే ఆయిల్‌పామ్‌సాగుకు ముందుకు వచ్చినట్లు చెప్పారు. తమ గ్రామంలోని రైతు సంఘానికి ఓ డ్రోన్ ఇప్పించాలని, చేవెళ్లలో డివిజన్ వ్యవసాయ, ఉద్యాన కార్యాలయలకు భవనాలు కేటాయించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గిండ్డంగుల సంస్థల చైర్మన్ ఆర్.నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ చంద్రకళ, జేడీఏ నర్సింహ్మారావు, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, గోపాల్‌రెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మానిక్యరెడ్డి, మధుసూదన్‌గుప్తా, ఆగిరెడ్డి, వసంతం, దర్శన్, కాలె శ్రీకాంత్, ప్రభాకర్, గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, వ్యవసాయశాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

రేషన్ డీలర్‌పై సస్పెన్షన్ వేటు



రేషన్ దుకాణానికి సస్పెన్షన్ ఉత్తర్వులను అంటించిన రెవెన్యూ సిబ్బంది

ఆమనగల్లు: పట్టణానికి చెందిన రేషన్ డీలర్ గాజుల భార్గవిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక రెవెన్యూ శాఖ అధికారులు ఆమెకు ఉత్వర్వులు ఇచ్చేందుకు వెళ్లగా అందుబాటులోకి రాలేదు. దీంతో షాప్‌కు ఉత్తర్వుల కాపీని అంటించి దుకాణానికి సీజ్ చేశారు.

భూధార్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు



చేవెళ్ల: టంగుటూరులో మాట్లాడుతున్న నర్సింహారావు

చేవెళ్ల: భూధార్ కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డీఏఓ నర్సింహారావు వ్యవసాయాధికారులను ఆదేశించారు. శనివారం ఆయన శంకర్‌పల్లి మండలం టంగుటూర్‌లో భూదార్ కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన చేవెళ్ల వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో ఏడీఏ సురేశ్‌బాబు, ఏఓ శంకర్‌లాల్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక గుంట మొదలుకుని ఎన్ని ఎకరాలున్నా భూధార్ కార్డు కోసం వ్యవసాయాధికారుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే అన్ని పథకాలు ఇక భూదార్ కార్డు ఆధారంగానే కొనసాగుతాయని చెప్పారు. రైతులంతా వ్యవసాధికారులకు సహకరించి ఈ రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలని కోరారు.

రైతు క్లస్టర్ సందర్శన

మొయినాబాద్ రూరల్: రైతులు భూధార్ తప్పక చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని రైతు క్లస్టర్‌ను సందర్శించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట చేవెళ్ల ఏడీఏ సురేశ్, మండల వ్యవసాయ అధికారి అనురాధ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి పొదుపు భవిష్యత్‌కు భరోసా

సహకార భారతి రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: మనం చేసే పొదుపు భవిష్యత్‌కు ఆర్థిక భరోసా ఇస్తుందని సహకార భారతి రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఏబీ కన్వెన్షన్ హాలులో శ్రీరామలింగేశ్వ సహకార సంఘం సమితి 13వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మనం ఎంత సంపాదించామనేది ప్రధానం కాదని, ఎంత పొదుపు చేస్తున్నామనేది ముఖ్యమని అన్నారు. అనవసర ఖర్చులను తగ్గించుకుని కొంత మొత్తాన్ని పొదుపు చేసుకుంటే భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడుతుందని వివరించారు. పొదుపు సహకార సంఘాలద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్థిక చేయూతనందిస్తున్నామని చెప్పారు. అనంతరం దుర్గావాహిణి సంస్థ రాష్ట్ర కన్వీనర్ వాణిసక్కుబాయి మాట్లాడుతూ.. పొదుపు సంఘాలు ప్రజల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. నియోజకవర్గంలో దాదాపు 50 గ్రామాల్లో పొదుపు సంఘాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పొదుపు సంఘాలతో స్వయం ఉపాధి అవకాశాలను కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామలింగేశ్వర సహకార సంఘం వ్యవస్థాపకుడు కుమారస్వామి, అధ్యక్షుడు మల్లేశ్ పూజారి, ఉపాధ్యక్షుడు మహేందర్, సీఈఓ సుమంత్‌కుమార్, మేనేజర్ రాఘవేందర్, గ్రామ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హారికకు ‘ప్రావీణ్య పురస్కార్’

కొడంగల్: పట్టణంలోని నవీన ఆదర్శ పాఠశాల విద్యార్థిని హారికకు రాష్ట్ర స్థాయిలో ప్రావీణ్య పురస్కార్ అవార్డు వరించింది. జాతీయ సెమ్స్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో మార్చిలో జాతీయ స్థాయి పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించిన హారికను శనివారం నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో సెమ్స్ ఫౌండేషన్ డైరెక్టర్ రాంచందర్‌రెడ్డి, ట్రస్టు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి అవార్డు, మెమెంటో, మెడల్‌తో సత్కరించారు. శాలువా కప్పి అభినందించారు. నవీన ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేష్ రాజ్‌ను విశేష పురస్కార్ అవార్డుతో సన్మానించారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు
- కబ్జాదారుడిపై కేసు

మొయినాబాద్: నగర శివారుల్లో ప్రభుత్వ భూములపై కబ్జాదారులు కన్నేశారు. మండల పరిధిలోని కనకమామిడి రెవెన్యూలో రూ.15 కోట్ల విలువచేసే మూడెకరాల ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జాచేసేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అడ్డుకుని కబ్జారాయుడిపై కేసు నమోదు చేశారు. వివరాలు.. కనకమామిడి రెవెన్యూ సర్వేనెంబర్ 510లో 300 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. ఇదే సర్వే నెంబర్‌లో కేతిరెడ్డిపల్లి వెళ్లే మార్గంలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని నగరానికి చెందిన ఇబ్రహీం అనే వ్యక్తి కబ్జా చేస్తున్నాడు. జేసీబీతో భూమిని చదును చేసి ప్రీకాస్ట్ వాల్‌తో రూంలు నిర్మిస్తున్నాడు. విషయం తెలుసుకున్న మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్, పోలీసులు, సిబ్బందితో అక్కడికి వెళ్లి కబ్జాను అడ్డుకున్నారు. కబ్జాదారుడు భూమి తనదని అధికారులతో వాగ్వాదానికి దిగాడు. అధికారులు భూమికి సంబంధించిన పత్రాలు చూపాలని కోరడంతో అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తూ వీరంగం చేశాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకునేందుకు యత్నించడంతో అక్కడి నుంచి పారిపోయాడు. ప్రభుత్వ భూమిని కబ్జాచేస్తూ వేసిన ఫెన్సింగ్, ప్రీకాస్ట్‌వాల్‌ను రెవెన్యూ అధికారులు తొలగించారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కబ్జాదారుడిపై కేసు నమోదు చేశారు.

వరుస ఘటనలు

మొయినాబాద్ మండలంలో ప్రభుత్వ భూముల కబ్జా ఘటనలు వరుసగా వెలుగుచూస్తున్నాయి. గురువారం మండల పరిధిలోని తోలుకట్టలో సర్వే నంబర్ 155లో రూ.5 కోట్లు విలువ చేసే 1.14 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ నిర్మించిన ప్రీకాస్ట్‌వాల్‌ను తొలగించి కబ్జా చెరనుంచి విడిపించారు. శుక్రవారం అజీజ్‌నగర్‌లో సర్వేనెంబర్ 177లో రూ.30 కోట్లు విలువ చేసే రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాలను తొలగించి భూమిని స్వాధీనం చేసుకుని బోర్డులు పెట్టారు. శనివారం కనకమామిడిలో 510 సర్వే నెంబర్‌లో రూ.15 కోట్ల విలువ చేసే మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చెరనుంచి కాపాడి బోర్డులు పెట్టారు.



కనకమామిడిలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ప్రీకాస్ట్ వాల్ తొలగింపు పనులు

భూముల జోలికొస్తే జైలుకే



ప్రభుత్వ భూములు ఖాళీగా కనిపిస్తే కొంత మంది అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ భూములు కబ్జాచేసేవారు ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదు. క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తాం. ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. ప్రభుత్వ భూముల చుట్టూ ఫెన్సింగ్ పనులు చేపడుతున్నాం.

– గౌతమ్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

మహేశ్వరం జీఎంసీ ఆకస్మిక తనిఖీ



మహేశ్వరం మెడికల్ కళాశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

- విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తాం
- మొదటి ఏడాది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేస్తాం
- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శనివారం ఆమె ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ త్రివేణిని అడిగి పనులుపై ఆరాతీశారు. ల్యాబ్‌లను పరిశీలించిన ఆమె విద్యార్థులకు కావాల్సిన సామగ్రి తెప్పించాలని సూచించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు ప్రస్తుతం 50 మంది మాత్రమే ఉన్నారని వారికి ఎలాంటి లోటు లేకుండా చూడాలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో నిర్వహించనున్న మొదటి సంవత్సరం పరీక్షలకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. మరో మారు హైలెవల్ కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. అప్పటి వరకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని వసతులు కల్పించి విద్యార్థులకు ఎలాంటి లోటు లేకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డి, వైస్‌ప్రిన్స్‌పాల్ నాగమణి, డాక్టర్ మహ్మద్ టాకుద్దీన్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఉజ్జయినీ మహంకాళి ఘటోత్సవాలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఘటోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. అమ్మవారి బోనాల జాతరకు 15 రోజుల ముందు (ఘటోత్సవం) ఘటాల ఎదుర్కోలు నిర్వహించడం ఆనవాయితీ. ఘటాల ఎదుర్కోలుతోనే బోనాల ఉత్సవాలు ప్రారంభమైనట్లుగా భావిస్తారు. ఘటాలకు సంబంధించిన సామగ్రిని కర్బలా మైదానం ప్రాంతంలోని అమ్మవారి దేవాలయానికి తీసుకువెళ్లి ఘటాన్ని ముస్తాబు చేస్తారు. ఆదివారం సాయంత్రం 7 గంటలకు ముస్తాబైన ఘటాన్ని డప్పుల దరువులతో దేవాలయానికి తీసుకువస్తారు.

వీధి వీధికి అమ్మవారి దర్శనం

ముస్తాబైన ఘటాన్ని సోమవారం నుంచి వివిధ ప్రాంతాల్లోని భక్తులకు దర్శనం గావిస్తారు. జూలై 11 వరకు ఆయా ప్రాంతాల్లో దర్శనం ఇచ్చి 12న దేవాలయానికి తీసుకువస్తారు. 13న బోనం, 14న రంగం, భవిష్యవాణి అనంతరం అంబారీ ఊరేగింపుతో అమ్మవారి ఘటాన్ని మెట్టుగూడలోని అమ్మవారి ఆలయానికి సాగనంపుతారు.

కొడంగల్‌లో ఆర్‌పీఎఫ్ బలగాల కవాతు



కవాతులో ఆర్‌పీఎఫ్ బలగాలు

కొడంగల్: పట్టణంలోని పలు కాలనీల్లో ఆర్‌పీఎఫ్ బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. 99 బెటాలియన్ హకీంపేటకు చెందిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు జవానులు కొడంగల్ పుర వీధుల గుండా తిరిగారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించడం వల్ల ప్రజల్లో భరోసా కల్పించడం కోసం కవాతు నిర్వహిస్తున్నట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి మెయిన్ రోడ్డు మీదుగా వినాయక చౌరస్తా, సంత బజార్, బ్రాహ్మనవాడ, తెలుగుగేరి, బాలాజీనగర్ మీదుగా కవాతు సాగింది.


యువసాయం

- సాగులో సత్తాచాటుతున్న దంపతులు
- మరో పదిమందికి ఉపాధి

ఉన్నత చదువులు చదివిన ఓ యువజంట ఒకరి చేతికింద పనిచేయడం ఇష్టంలేక స్వయం ఉపాధివైపు అడుగులు వేసింది. తమకు ఇష్టమైన వ్యవసాయ రంగాన్ని ఎంచుకుని పది మందికి ఉపాధి కల్పిస్తూ మంచి ఆదాయం ఆర్జిస్తోంది.



క్యాప్సికమ్ పంటను చూపుతున్న అమృత్‌రాజ్, స్వప్న దంపతులు



కోతకు సిద్ధంగా క్యాప్సికమ్ పంట

షాబాద్: మండల పరిధిలోని కుర్వగూడకు చెందిన దాదె అమృత్‌రాజ్, స్వప్న దంపతులు షాద్‌నగర్‌లో చదువుకున్నారు. అమృత్‌రాజ్ బీఏ. బీఈడీ పూర్తి చేయగా, స్వప్న ఎంఏ చేస్తోంది. 2000 సంవత్సరంలో వివాహం చేసుకున్న వీరికి ముగ్గురు సంతానం. ప్రభుత్వ ఉద్యోగాలకు ఎదురు చూడకుండా తమకు ఇష్టమైన వ్యవసాయ రంగంలో స్వయం ఉపాధితో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. పదేళ్ల క్రితం వారికున్న రెండు ఎకరాల్లో రూ.15 లక్షలు వెచ్చించి పూల మొక్కల నర్సరీ ఏర్పాటు చేశారు. మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని అందులో ఆధునిక పద్ధతుల్లో వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. వీరు పండించే కూరగాయలకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతోంది. ప్రస్తుతం ఐదెకరాల్లో రూ.4లక్షలు వెచ్చించి క్యాప్సికమ్ సాగు చేపట్టారు. ఇప్పుడు కోత ప్రారంభం కావడంతో మార్కెట్‌లో కిలోకు రూ.40 నుంచి రూ.60 వరకు ధర పలుకుతున్నది. ఎనిమిది నెలల వరకు పంట దిగుబడి రానుంది. ఇప్పుడు కోత ప్రారంభమైందని, పంట పూర్తయ్యే వరకు మొత్తం 60 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతు దంపతులు చెబుతున్నాడు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేకున్నా సొంత ఖర్చులతో పంటకు డ్రిప్, మల్చింగ్, పందిరి ఏర్పాటు చేసుకుని నాణ్యమైన కూరగాయలు పండిస్తున్నట్లు తెలిపారు. కూరగాయలను నగరంలోని గుడిమల్కాపూర్ మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. కాయ నాణ్యతగా ఉండడంతో పొలం వద్దకు వచ్చి సైతం కొనుగోలు చేస్తున్నారు.

పది మందికి ఉపాధి

పందిరి పద్ధతిలో కూరగాయల సాగు చేపడుతుండడంతో రోజుకు పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. అమృత్‌రాజ్, స్వప్న దంపతులతో పాటు గ్రామానికి చెందిన మరో 10 మంది రోజు వీరి పొలంలో పనులు చేస్తున్నారు. పంటకు మందులు వేయడం, కలుపు తీయడం, కోయడం, ఎరువులు వేయడం, నీరు పెట్టడం తదితర పనులు చేస్తుంటారు. రోజుకు రూ.350 కూలీ ఇస్తున్నారు.

వ్యవసాయమే సంతోషం

వ్యవసాయం చేయడం సంతోషాన్ని ఇస్తుంది. మా పొలంతో పాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకుని కూరగాయల సాగు చేస్తున్నా. అధికారులు, ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. సొంత ఖర్చులు వెచ్చించి డ్రిప్, మల్చింగ్ ఏర్పాటు చేసుకుని పందిరి పద్ధతిలో క్యాప్సికమ్ సాగు చేశా. ప్రస్తుతం ధర ఉండడంతో ఆదాయం బాగానే ఉంది. నెలకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది.

– అమృత్‌రాజ్, యువరైతు, కుర్వగూడ

ఆదాయం బాగుంది

నేను, నాభర్త ఎంఏ, బీఈడీ చేశాం. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడలేదు. ఒకరి చేతికింద పని చేయడం ఇష్టం లేదు. దీంతో వ్యవసాయంపై ప్రేమ, మక్కువ పెంచుకుని సొంత పొలంలో ఆధునిక పద్ధతుల్లో కూరగాయల పంటలు సాగు చేస్తున్నాం. ఆదాయం బాగానే వస్తుంది. ముగ్గురు పిల్లలను మంచిగా చదివిస్తున్నాం. రోజు పొలంలో పనిచేయడం సంతోషంగా ఉంది.

– స్వప్న, మహిళారైతు, కుర్వగూడ

దేశ రక్షణలో యువత కీలకం

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్


రాజాసింగ్‌ను సన్మానిస్తున్న స్వామిజీలు

మొయినాబాద్ రూరల్: దేశ రక్షణలో యువత కీలకమని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలోని స్వామి నారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఇన్వెస్టించర్ కార్యక్రమ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే దేశభక్తితో పాటు రాజకీయాలపై మక్కు వ పెంచుకోవాలన్నారు. దేశ భద్రతలో భాగస్వా ములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధా న స్వామీజీ సుక్‌వల్లభ్, ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

మాడ్గుల: చికెన్ తీసుకుని వస్తానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని నర్సాయిపల్లిలో చోటు చేసుకుంది. సీఐ వేణుగోపాల్‌రావు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కడారి అంజన్‌కుమార్(36) శుక్రవారం సాయంత్రం చికెన్ తీసుకువస్తానని చెప్పి వేయిరూపాయలు తీసుకుని కొలుకులపల్లికి వెళ్లాడు. రాత్రైనా రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. శనివారం గ్రామ శివారులోని గుట్టమీద రేల చెట్టుకు పంచతో ఉరేసుకున్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడికి భార్య అలివేలు, ఓ కూతురు ఉన్నారు. అంజన్‌కుమార్ తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


రహ్మతుల్లా ఖాన్

పహాడీషరీఫ్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పహాడీషరీఫ్‌కు చెందిన హబీబుల్లాఖాన్ కుమారుడు రహ్మతుల్లాఖాన్(40) తాగుడకు బానిసయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు 2024 జనవరిలో బాలాపూర్ మెట్రో సిటీలోని మా హెల్ప్ డిటెక్షన్ సెంటర్‌లో చేర్పించారు. ఆరు నెలల పాటు చికిత్స పొందిన అనంతరం రహ్మతుల్లా ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికినా లాభం లేకపోవడంతో సోదరుడు అంజదుల్లాఖాన్ శుక్రవారం రాత్రి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు బాలాపూర్ పీఎస్‌లో లేదా 87126 62366 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆలయాలకు దారి మూసేయడం తగదు

మాజీ మంత్రి సబితారెడ్డి


మల్లన్న స్వామి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న సబితారెడ్డి

పహాడీషరీఫ్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నగర శివారులోని విలువైన ప్రభుత్వ భూములను విక్రయించడమే పనిగా పెట్టుకుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి విమర్శించారు. శనివారం ఆమె గ్రామస్తులతో కలిసి హౌజింగ్ బోర్డు అధికారులు ఫ్రీ కాస్ట్ గోడలను నిర్మిస్తున్న మామిడిపల్లిలోని దొంతరాల గుట్టపై ఉన్న మల్లన్న స్వామి, ఆంజనేయ స్వామి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయానికి వెళ్లకుండా అధికారులు ప్రహరీ నిర్మిస్తున్నారని స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ ఎక్కడ ప్రభుత్వ భూములున్నాయో గుర్తించి, వాటిని అమ్మడమే ఎజెండాగా పెట్టుకుందన్నారు. హెచ్‌సీయూ భూముల విక్రయం వెలుగులోకి వచ్చి ఆగిపోవడంతో, చివరకు ఆ భూములను తాకట్టు పెట్టి బ్యాంక్‌లలో రూ.10 వేల కోట్లు రుణం తీసుకొచ్చిందన్నారు. ఇతర ప్రాంతాలలోని భూములను కూడా విక్రయించడంలో భాగంగానే రావిరాలలోని భూముల వద్దకు రావడంతో అడ్డుకున్నామన్నారు. శంషాబాద్ విమానాశ్రయం నిర్మాణ సమయంలో మామిడిపల్లి రైతులు పెద్ద ఎత్తున పొలాలు ఇచ్చారన్నారు. ఇందులోని 50 ఎకరాలను ప్రభుత్వం హౌజింగ్ బోర్డుకు కేటాయించిందన్నారు. రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వనందున, హౌజింగ్ బోర్డు అధికారులు స్థలాన్ని ఆధీనంలోకి తీసుకునే సమయంలో రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అప్పట్లోనే కోరామని గుర్తు చేశారు. విమానాశ్రయం నిర్మాణానికి ముందే ఇక్కడ ఆలయాన్ని నిర్మించుకున్నారని, ప్రస్తుతం ఆలయానికి కూడా వెళ్లకుండా అధికారులు ఫ్రీ కాస్ట్ వాల్ నిర్మించడం సరికాదన్నారు. దేవాలయం జోలికి రావద్దని అధికారులకు సూచించారు. రావిరాల జొన్నాయిగూడలో లక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి గతంలో 30 ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందని, ప్రస్తుతం అవసరం లేనప్పటికీ, పాత రోడ్డును వదిలేసి ఆలయ భూముల్లో నుంచి కొత్త రోడ్డు వేస్తున్నారన్నారు. అనంతరం ఆమె హౌజింగ్ బోర్డు అధికారులను ఫోన్‌లో సంప్రదించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పవన్ కుమార్ యాదవ్, శివకుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు నరేష్ యాదవ్, గోపాల్ యాదవ్, బాలరాజు యాదవ్, గ్రామస్తులు నందీశ్వర్, దశరథ, శ్రీనివాస్ రెడ్డి, రంగనాథ్, మహేందర్ యాదవ్, శంకర్ యాదవ్, చంద్రయ్య యాదవ్, ఎల్.శ్రీనివాస్, ఎస్.యాదగిరి, కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

స్కూటీని కారు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి చేరిన మృతులు

మొయినాబాద్: కారు, స్కూటీని ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మండల పరిధిలోని రెడ్డిపల్లి సమీపంలోని ఈ నెల 25న స్కూటీపై వెళ్తున్న మహిళను ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో హిమాయత్‌నగర్‌లో అద్దెకుండే ఖైరతాబాద్‌కు చెందిన అశ్విని(37), మేడిపల్లికి చెందిన సుశీల(60) మృతి చెందిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో గాయపడిన అశ్విని మరుదలు లక్ష్మి(35) నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దీంతో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య మూడుకు చేరింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం


సురేఖ వెంకటదుర్గ(ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జయరాం కుటుంబం తుక్కుగూడలోని నార్త్ స్టార్ ఏర్‌పోర్ట్ బాలియార్డ్ విల్లాలో నివాసం ఉంటోంది. ఈయన కుమార్తె సురేఖ వెంకట దుర్గ(24) ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 23వ తేదీన కుటుంబ సభ్యులు నిద్రలేచి చూసేసరికి వెంకట దుర్గ కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికినా లాభం లేకుండా పోయింది. శివ అనే యువకుడిపై అనుమానం ఉందని తల్లి దేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు

పెంచుతున్న వ్యక్తి అరెస్టు

శంషాబాద్ రూరల్: ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఊట్‌పల్లిలో ఉన్న డైమండ్ ఎస్టేట్ కాలనీలో తారకేశ్వర్ తన కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఇతనికి ఖైనీ, గుట్కా నమలడం అలవాటు ఉంది. ఈ క్రమంలో కొన్ని నెలల నుంచి వీటిని అతను ఓఆర్‌ఆర్ వంతెన వద్ద కొంత మంది ద్వారా కొనుగోలు చేస్తున్నాడు. వాటితో పాటు వారు ఇతనికి గంజాయిని కూడా విక్రయించారు. గంజాయిలో విత్తనాలు కనిపించగా..వాటిని తన ఇంటి ఆవరణలో కూరగాయలతో పాటు పెంచుతున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతన్ని ఇంటికి వెళ్లి విచారణ చేయడంతో గంజాయి మొక్కలు కనిపించాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బుతో ఉడాయించిన వ్యక్తిపై ఫిర్యాదు

రాజేంద్రనగర్: ఆన్‌లైన్ క్యాష్ ట్రాన్స్‌ఫర్ చేసుకొని ఉడాయించిన నేరస్తుడి కోసం రాజేంద్రనగర్ పోలీసులు గాలిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ..కిస్మత్‌పూర్‌లో ఓ వ్యక్తి తన చిల్లర దుకాణంలోనే ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్‌ను చేస్తుంటాడు. శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి (30) ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ ద్వారా రూ.75 వేల నగదు కావాలని కోరాడు. డబ్బులు అర్జెంట్ ఉందని..రూ.5 వేలు అదనంగా ఇస్తానని తెలిపాడు. దీంతో దుకాణ నిర్వాహకుడు డబ్బును గుర్తు తెలియని వ్యక్తికి ఇచ్చాడు. ఆన్‌లైన్ పేమెంట్ చేస్తానంటూ అతన్ని మాటల్లో దింపి అక్కడి నుంచి జారుకున్నాడు. దీంతో బాధితుడు రాజేంద్రనగర్ పోలీసులను ఆశ్రయించాడు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు నిందితుడు హిమాయత్‌సాగర్‌కు చెందిన పాత నేరస్తుడిగా గుర్తించారు. నిందితుని కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు శ్రీరాంనగర్ ఎన్నికలు

మణికొండ: శ్రీరాంనగర్ (సెక్రటేరియట్) కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తామన్నారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కోశాధికారి పదవులకు పోటీ అధికం కావడంతో ఎన్నికలు నిర్వహిస్తున్నామని, మిగతా పదవులకు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిపోయిందన్నారు.

కోర్టు కాంప్లెక్స్ సందర్శన

- ఆవరణలో మొక్కలు నాటిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్
- బార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం


ఇబ్రహీంపట్నంలోని కోర్టు కాంప్లెక్స్‌ను సందర్శించిన జిల్లా జడ్జి కర్ణకుమార్

ఇబ్రహీంపట్నం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ శనివారం ఇబ్రహీంపట్నం కోర్టు కాంప్లెక్స్‌ను సందర్శించారు. ఇక్కడ కొనసాగుతున్న 15వ అదనపు జిల్లా న్యాయస్థానం, సీనియర్, జూనియర్ కోర్టులను పరిశీలించి, ప్రాంగణంలో మొక్కలు నాటారు. అదనంగా కోర్టు బిల్డింగ్, క్యాంటిన్, ఫ్యామిలీ కోర్టు తదితర అవసరాలకు సంబంధించిన ప్రతిపాదనలను పంపిస్తే.. తాను హైకోర్టు దృష్టికి తీసుకెళ్లి పనులు వేగవంతమయ్యేలా చూస్తానని తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్ శ్రీదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి రీటా లాల్‌చంద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి యశ్వంత్‌సింగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముద్దం వెంకటేశం, ప్రధాన కార్యదర్శి అరిగే శ్రీనివాస్‌కుమార్, ఉపాధ్యక్షులు భాస్కర్, సహాయ కార్యదర్శి కృష్ణ, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయమూర్తి కర్ణకుమార్‌ను ఘనంగా సన్మానించారు.

అగ్నివీర్ శిక్షణ కేంద్రం నుంచి యువకుడి అదృశ్యం

బెంగళూరులోని హోల్సూర్ పీఎస్‌లో బాధితుల ఫిర్యాదు


సతీష్(ఫైల్)


బేగంపేటలో కుటుంబీకులను పరామర్శిస్తున్న నర్సింహారెడ్డి తదితరులు

కందుకూరు: బెంగళూరులో అగ్నివీర్ శిక్షణ పొందుతున్న మండల పరిధిలోని బేగంపేటకు చెందిన యువకుడు దయ్యాల సతీష్ అదృశ్యమయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం.. దయ్యాల కొమురయ్య రెండో కొడుకు సతీష్ (20) ఈఏడాది మార్చి నెలలలో అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. శిక్షణ కోసం బెంగళూరు వెళ్లాడు. రెండు నెలలుగా ట్రైనింగ్ పొందుతున్న సతీష్ ఈనెల 24న అదృశ్యమయ్యాడు. శిక్షణలో ఓ సార్ తనను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని స్నేహితులకు మెస్సేజ్ చేశాడు. ఈ విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వెంటనే బెంగళూరుకు చేరుకుని ఈనెల 27న హోల్సూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వి.బాల్‌రాజ్ తదితరులతో కలిసి బేగంపేటలోని సతీష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

త్వరలో రైఫిల్ షూటింగ్ శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటికే వివిధ క్రీడల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ త్వరలో రైఫిల్ షూటింగ్‌లోనూ శిక్షణ ఇవ్వనుంది. ఇప్పటికే అమీర్‌పేటలోని గురుగోవింద్‌సింగ్‌జీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షూటింగ్ రేంజ్, శిక్షణకేంద్రాన్ని ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎంసీ.. దాని నిర్వహణ కోసం, శిక్షణ నిచ్చేందుకు ఆసక్తిగల ఏజెన్సీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణతోపాటు బిడ్స్‌ను ఆహ్వానించింది.

ఒలింపిక్స్ పతకాల స్ఫూర్తితో..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలపై ఆసక్తి కనబరుస్తూ ప్రాధాన్యమిస్తుండటం తెలిసిందే. గత సంవత్సరం ఒలింపిక్స్‌లో ఎయిర్‌పిస్టల్ షూటింగ్‌లో మనూభాకర్ వ్యక్తిగతంగా , మిక్స్‌డ్ టీమ్‌లో సరబ్‌జోత్‌సింగ్‌తో కలిసి రెండు పతకాలు సాధించిన నేపథ్యంలో పలువురు విద్యార్థులు,క్రీడాకారులు షూటింగ్‌పై ఆసక్తి కనబరచడంతో జీహెచ్‌ఎంసీ షూటింగ్ శిక్షణ నిప్పించేందుకు సిద్ధమైంది. తొలిదశలో అమీర్‌పేట, శేరిలింగంపల్లి, అంబర్‌పేట ప్రాంతాల్లోని స్టేడియంలలో ఏర్పాట్లు చేయాలనుకున్నప్పటికీ, అమీర్‌పేట కేంద్రంలో షూటింగ్ రేంజ్‌ఏర్పాట్లు పూర్తి కావడంతో నిర్వహణ కోసం ఆసక్తి వ్యక్తీకరణతో పాటు బిడ్‌లను ఆహ్వానించింది. ఆసక్తి కల ఏజెన్సీలు స్విస్ చాలెంజ్ మోడల్‌లో తమ ప్రతిపాదనలు సమర్పించాలని కోరింది. బిడ్‌లు సమర్పించే ఏజెన్సీలు స్పోర్ట్స్ అర్హత, అనుభవం కలిగిన సూపర్‌వైజర్/వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలి. అంకిత భావం కలిగిన కేర్‌టేకర్ ఉండాలి. అవసరమైనప్పుడు మరమ్మతులు చేయగలిగే సామర్థ్యం ఉండాలి. నిర్వహణ కోసం తగినంత మంది సిబ్బందిని నియమించాలి. శిక్షణ నిచ్చేందుకు అర్హులైన కోచ్‌లు ఉండాలి. ఏజెన్సీ ఎంపిక పూర్తయ్యాక, శిక్షణకార్యక్రమాలు ప్రారంభించనున్నారు.



పీజేఆర్ ఫ్లైఓవర్.. థాంక్యూ సార్



గచ్చిబౌలిలో రూ.182.72 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫ్లైఓవర్‌ను శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ ఫ్లైఓవర్‌కు పీజేఆర్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపి.. జ్ఞాపికను అందజేశారు.